పక్షుల వేటగాడు

ఇండోనేసియా జానపద కథ



పక్షుల వేటగాడు

ఇండోనేసియా జానపద కథ

తిరిగి చెప్పింది: చిన్ హర్న్ చెక్



దేశ రాజు అయిన ఇషక్‌కి విలు విద్య అంటే ఎంతో ఇష్టం. అతని స్నేహితులు ఇతర విషయాలు చర్చించే వాళ్లు. కానీ, రాజు మాత్రం ఉదయం నుంచి రాత్రి వరకు విల్లు, బాణాల గురించే మాట్లాడేవాడు. విలు విద్య పట్ల రాజుకి ఉన్న ప్రేమ త్వరలోనే అందరికీ తెలిసిపోయింది.



రాజుకి బీనా దేవి అనే చాలా అందమైన కూతురు ఉంది.

ప్రతి యువకుడు పెళ్లి చేసుకోవాలనేంత అందంగా ఆమె ఉండేది.

మేటి విలుకాడికి మాత్రమే తన కూతురిని ఇచ్చి పెళ్లి చేస్తానని

రాజు ఇషక్ తెలియచేశాడు.





అందుకని, రాజు ఒక రోజు విలు విద్య పోటీ ప్రకటించాడు.
ఆ పోటీలో పాల్గొనటానికి దేశం అన్ని ప్రాంతాల నుంచి ఎంతో
మంది యువకులు వచ్చారు.
అంతమంది వచ్చినా రాజుకి వాళ్లల్లో మేటి విలుకాడు ఒక్కడూ
కనపడలేదు. యువరాణిని ఎవ్వరూ గెలుచుకోలేకపోయారు.



ఆ దేశంలో వాజన్ అనే పక్షుల వేటగాడు ఉండేవాడు. అతను ఎంతో పేదవాడు.

రాజు ఇషక్‌కి అందమైన కూతురు ఉందని, మేటి విలుకాడికి మాత్రమే ఆమెను ఇచ్చి పెళ్లి చేస్తాడని అతను విన్నాడు.

రాకుమారిని పెళ్లి చేసుకుంటే బాగుంటుందని వాజన్‌కి అనిపించింది. అందుకని అతను ఒక ఉపాయం పన్నాడు.


ఒక వలతో కొన్ని పక్షులను పట్టుకున్నాడు.

తరవాత వాటిని చంపి, వాటి కుడి కళ్లు తీసేశాడు.

ఆ పక్షులను ఒక బద్దకు వేలాడదీశాడు.

ఆ తరవాత కోట వైపుకి బయలుదేరాడు.

అలా వెళుతూ, “ఒంటి కన్ను పక్షులు అమ్ముతాం! ఒంటి కన్ను పక్షులోయ్!” అంటూ అరవసాగాడు. ఒంటి కన్ను పక్షులను అమ్మేవాడిని అంతకుముందు చూడకపోవటంతో వెళ్లిన చోటల్లా అతని వెనక పిల్లల గుంపు చేరసాగింది.



దారి పొడుగూతా, "ఒంటి కన్ను పక్షులు అమ్ముతాం! ఒంటి కన్ను పక్షులోయ్!" అంటూ వాజన్ అరుస్తూనే ఉన్నాడు.

కోట గుమ్మం దగ్గర చేరిన పిల్లల గుంపుని చూసి, విషయం ఏమిటో కనుక్కోమని సేవకుడిని పంపించాడు రాజు.





తిరిగివచ్చిన సేవకుడు, “మహారాజా, ఒక పేద, పక్షుల వేటగాడు ఒంటి కన్ను పక్షులను అమ్ముతున్నాడు,” అని చెప్పాడు.

అది విన్న మహారాజు, “అతనిని వెంటనే ఇక్కడికి తీసుకుని రండి,” అని ఆదేశించాడు.

దాంతో వాజన్‌ని రాజు ముందుకి తీసుకుని వచ్చారు.

“ఒక్క కన్ను పక్షులను నువ్వు అమ్ముతున్నావంట, నిజమేనా?” రాజు ఇషక్ అడిగాడు.

“అవును, మహారాజా. నా బాణంతో పక్షిని కంటిలో కొట్టి చంపుతాను,” బదులిచ్చాడు పక్షుల వేటగాడు.

ఆ మాటలు విన్న రాజు ఎంతో ఆశ్చర్యపోయా . తన చెవులను తానే నమ్మ లేకపోయాడు. “బాణంతో పక్షిని కంటిలో కొట్టటం అంత తేలిక కాదు, అబ్బాయా. దేశంలోకెల్లా నువ్వు మేటి విలుకాడివి అయి ఉండాలి,” అన్నాడు రాజు. “నీలాంటి గొప్ప విలుకాడికి అందమైన భార్య ఉండాలి. నా కూతురిని నువ్వు పెళ్లి చేసుకుంటావా?”

“కానీ, మహారాజా! నేను పక్షులను పట్టే పేదవాడిని. రాకుమారికి అలవాటైన జీవితాన్ని ఇవ్వటానికి నా దగ్గర అంత డబ్బులు లేవు.”





“ఆహాఁ! నువ్వు గొప్ప విలుకాడివే కాదు, నిజాయితీపరుడివి కూడా. నేను రాజుని. నీకు కావలసినన్ని డబ్బులు ఇస్తాను. పెళ్లి అయిన తరవాత నువ్వు ఈ కోటలోనే ఉండవచ్చు,” అన్నాడు రాజు.

ఆ మాటలు విన్న వాజన్ ఎంతో సంతోషించాడు. అయితే అది బయటకు కనపడకుండా జాగ్రత్తపడ్డాడు.

కొద్ది రోజులకే రాకుమారితో వాజన్ పెళ్లి జరిగింది.
అతనికి ఇచ్చిన కొత్త బట్టలు వాజన్ వేసుకున్నాడు.
తన కోరిక నిజమైనందుకు అతను చాలా
సంతోషించాడు.
ఇప్పుడు అతనికి అన్నీ ఉన్నాయి — భార్యగా
అందమైన రాకుమారి, కోటలో నివాసం.





పెళ్లి రోజున ఘనమైన విందుని రాజు ఏర్పాటు చేశాడు.

దానికి తన స్నేహితులను చాలామందిని పిలిచాడు.

ఆ రోజు చాలా ఆహ్లాదంగా ఉంది.


ఆకాశంలో రంగురంగుల పిట్టలు ఎన్నో ఎగురుతున్నాయి.

భోజన పదార్థాలు ఎంతో రుచికరంగా ఉన్నాయి.

వాయిద్యకారులు చక్కని సంగీతం వినిపిస్తున్నారు.

అందరూ ఎంతో సంతోషంగా ఉన్నారు.

ఉన్నట్టుండి రాజు ఎంతో ఉత్సాహంతో, "చూడండి! మేటి విలుకాడు ఇప్పుడు తన విలు విద్యా నైపుణ్యాన్ని మనకి చూపిస్తాడు," అంటూ అరిచాడు.



ఆ మాటలు విన్న వాజన్‌కి మూర్ఛ వచ్చినంత పని అయ్యింది.

ఆ అదురుపాటు నుంచి తేరుకున్న తరవాత, “నా నైపుణ్యాన్ని మీ ముందు చూపించాలని నాకు కూడా ఎంతగానో ఉంది, మహారాజా. కానీ, నా విల్లు, బాణాలను ఇంటి దగ్గర వదిలిపెట్టి వచ్చాను. కాబట్టి ఆ పని చెయ్యలేను,” అన్నాడు వాజన్.

ఎంతో తెలివిగా సమాధానం ఇచ్చానని వాజన్ అనుకున్నాడు.

అయితే, రాజు ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. “దానిదేముంది. నా విల్లు తీసుకో,” అంటూ రాజు తన విల్లు, బాణాలు తీసుకుని రమ్మని ఒక సేవకుడిని పంపించాడు.

తన బండారం త్వరలోనే బయట పడిపోతుందని వాజన్ భయంతో వణికిపోసాగాడు.

రాజు గారి విల్లు, బాణాలతో సేవకుడు తిరిగి వచ్చాడు. వాటిని వాజన్ చేతికి రాజు ఇషక్ అందించాడు.

“విల్లు ఇదిగో. ఇప్పుడు నీ నైపుణ్యాన్ని చూపించు,” అన్నాడు రాజు.





వలను ఉపయోగించటం మాత్రమే వాజన్‌కి తెలుసు. అంతకు ముందు ఎప్పుడూ అతను విల్లుని ఎక్కుపెట్టలేదు. బాణాన్ని వింటి తాడుకి పెట్టి ఆకాశంవైపుకి గురిపెట్టాడు. అయితే, బాణాన్ని వదిలే ధైర్యం లేక అలాగే నిలబడిపోయాడు.

ఆకాశంలో చాలా పక్షులు ఎగురుతున్నాయి. ఆ గొప్ప విలుకాడు ఒక్క పక్షిని కూడా కొట్టకపోవటం చూసి చాలామంది ఆశ్చర్యపోసాగారు.

కొంతమంది అతనిని చూసి నవ్వసాగారు.

“అతను భయపడుతున్నాడు. చూడండి, బాణాన్ని సరిగ్గా పట్టుకోవటం కూడా అతనికి చేతనైనట్లు లేదు!” అని ఒకతను అన్నాడు.



చివరికి, సహనం కోల్పోయిన ఒక వ్యక్తి వాజన్ దగ్గరకి వెళ్లి, అతన్ని వీపు మీద గట్టిగా చరిచి, “గొప్ప విలుకాడివి అన్నారు, బాణం వెయ్!” అన్నాడు.

అలా గట్టిగా కొట్టటంతో వాజన్ చేతిలోంచి బాణం బయటకు దూసుకుని పోయింది. అదే సమయంలో అటుగా వెళుతున్న ఒక కొంగకి ఆ బాణం తగిలింది. ఆ దెబ్బకి కొంగ చచ్చిపోయి, కిందకి పడింది.





కొంగని చేతిలోకి తీసుకున్న రాజు దాని సన్నని మెడకి తగిలిన బాణాన్ని చూసి ఆశ్చర్యపోయాడు.

"ఇంతటి గొప్ప విలుకాడిని నేను ఇంతకు ముందు చూడలేదు," అంటూ రాజు సంతోషంతో అరిచాడు.

అందరూ నోరు వెళ్లబెట్టి చూస్తున్నారు. వాజన్ మాత్రం చాలా కోపం వచ్చినట్టు నటించాడు.

"నా జీవితంలో మళ్లీ విల్లు, బాణాలను ముట్టను," శపథం చేశాడు వాజన్. "పక్షుల కుడి కంటిని కొట్టి చంపుతానని నేను చెప్పాను, మెడని కాదు. ఆ వ్యక్తి నా వీపు మీద కొట్టి ఉండకపోతే నా బాణం ఆ కొంగ కంటికి తప్పకుండా తగిలి ఉండేది."

విలుకాడిని వీపు మీద కొట్టిన వ్యక్తిని రాజు వెంటనే శిక్షించాడు.



అన్న మాట ప్రకారం వాజన్ మళ్లీ విల్లు, బాణాలను తాకలేదు. దాంతో రాజ్యంలోకెల్లా అతనే గొప్ప విలుకాడని ప్రజలందరూ ఇంకా చెప్పుకుంటూనే ఉన్నారు.

అయిపోయింది